

# పశ్చాత్తాపం

'సత్యకృష్ణ

పశ్చాత్తాపాన్ని మించిన ప్రాయశ్చిత్తం లేదని ప్రవక్తలు చెప్పారు ఒకవేపునించి చూస్తే అది సంపూర్ణ మానవతగా కనిపించవచ్చు. కానీ, మరొకవేపు దీనంగా, హీనంగా పడివున్న గాయ పడిన ప్రపంచ శరీరానికి ఆ పశ్చాత్తాపం పరిష్కారం అవుతుందా?

"అందరూ రిలీజ్ నాడే చూసేయాలేంటి సినిమా?" మరి తనెందుకొచ్చినట్టు ఫస్టుడేని? అబ్బే! అది వేరు. యిది వేరు ఊరోళ్ళకో న్యాయం. తన దగ్గరకొస్తే వేరే న్యాయం. అందుకే ఈ దేశం బాగుపడటంలేదు. వేసినచోటనే పడుంది. "ఎక్కడున్నావే గొంగళీ"సామెతకి పోటీగా నిలబెడితే "ఎక్కడున్నావే భారద్దేశ: " సామెతే గెలుస్తుంది. యిదే ఎక్కువ ఏనకబడివుంది కనక. సింపుల్ లాజిక్! డేజిలింగ్ ఫేక్ట్!! యూ మస్ట్ అడ్మిట్ సర్టెనీ.

"దేనికీ లేదింత డిమేండ్. మరి దీనికెందుకున్నట్టు?" యింకే దేశంలోనూ యిలా యిరగబడి సినిమాలు చూడరంట జనం! యిన్నేసి గంటల పొడుగుండగంట సినిమా! అక్కడంతా బిజీ బీలంట! యిక్కడంతా లేజీ బీలు! ఎవర్నో అన్నటనేస్తున్నాడు. మరి తన మాటేమిటి? తనకేదో వర్రీగా వుండి వచ్చాడు! మరి మిగతా జనమంతా? అంతా అంతే అనుకుంటే పోలా! పోద్ది-ఎందుకు పోదు? నోటికాడ కూడు పోతది ఆళ్ళకి.

కూలి రాళ్ళన్నీ సిన్మాలకి తగలేస్తే కూటికేం మిగుల్తుంది? తనకంటే ఫరవాలేదు. జీతం రాళ్ళు యింటి ఖర్చులకిచ్చేస్తే గీతం రాళ్ళతో జల్సాలు చేయొచ్చు. ప్రమోషనిస్తానంటే వద్దన్నాడు తను! అమ్మో! వెధవ ప్రమోషన్లో ఏవుంది? ఈ సీట్లోనే వుందంతా. సిమెంటు కోటా సీటంటే మాటలేంటి? తను పదివేలెట్టి కొనుక్కున్నది. ప్రమోషనొచ్చి వుప్పెనలా తన సిరిని తుడిచిపెట్టెయ్యబోయింది. తనూరుకున్నాడేంటి? ఓ అయిదువేలిచ్చి ఆర్డర్సు కేన్సిల్ చేయించేశాడు. తొరగా యిల్లు చక్కబెట్టేసుకోవాలి - అదేదో సామెత చెప్పినట్లు. గుర్తొచ్చి చావటం లేదు పూర్తిగా ఏదో లెద్దూ! కూటికా గుడ్డకా వెధవ జనరల్ నాలెడ్జి! అసలు నాలెడ్జికీ విలువలేదీ రోజుల్లో....

"అబ్బ తోసెయ్యకండయ్యా"

"ఊ తోసేసుగుంటున్నారు". ఎవడిమటుకు వాడు అదే కూత. మరి ఎవరు తోసేస్తున్నట్లు?! లైనెంతయిందో-ఒంటిగంటేనా! క్యూలో నిలబడి గంటయింది. యింకా ఓ గంట నిలబడాలి. అబ్బ! బతుకుతానా అప్పటిదాకా? యిలాగే అనుకుంటూ బ్రతుకుతున్నాడు. ముప్ఫై ఏళ్ళనించీ! అయ్యబాబోయ్ రేటెంత పెరిగిపోతున్నాయ్ బ్రతుకుతానా అనుకున్నాడు ఓ వంద సార్లు- కష్టాలొచ్చేశాయి. బ్రతుకుతానా

అనుకున్నాడు ఓ వెయ్యిసార్లు. అన్ని సార్లూ దివ్యంగా బ్రతికాడు!! బ్రతికుండ బట్టే ఈ రోజు ఈ రోహిణీ ఎండలో గంట నించి నిలబడివున్నాడు తనేంటి బ్రతికేవోళ్ళంతా అలాగే బ్రతుకు తున్నారు.

"రేపు నడిపల్లి షావుకారు రావాల్సి వుంది. వందబసాయి వేయించేదాకా విడిచి లేను. మొత్తంమీద అసాధ్యుడు! దేవాంతకుడు! కాలాంతకుడు! యింకా యిలాంటి వెన్నుంటే అన్నీ వాడే!! ఆ మాటకొస్తే తనూ అసాధ్యుడే కలెక్టరాఫీస్ మొత్తం మీద తనే ఎక్కువ లాగేసున్నాడు. అనకూడదుగాని తనకేం తక్కువ కలెక్టర్ గారి కంటే? రేంక్ పెద్దదవుతే అవుగాక. తను ఐ ఏ యస్ పాస్ అవలేదు. ఆయన పాస్ అయ్యాడు అంతేగా తేడా! మిగతా విషయాల్లో- ముఖ్యంగా మనీ విషయంలో తనే ఎక్కువ. సిగ్గు విడిచి అడిగితే ఆయనకే సర్దగల సమర్థత తనకుంది!! ఆపైన కేసు బనాయిస్తే యింత డబ్బెక్కడిదని? అయినా యివేం వెధవ ఆలోచనలు? ఎందుకొచ్చిన పెంట?

"బాబూ సక్కిడాలు" చిన్న కేక. చిన్న పిల్ల కేకకాదు. పైకి పెగిలి రాలేని పెద్దదాని కేక. వొక వృద్ధురాలి కేక. ఎనభైకి తక్కువుండవ్. ఈ ఎండలో తనే నిలబడలేకపోతున్నాడు. ఏంటమ్ముతుంది? వడి చక్కిడాయిలు. రెండు వడలు, మూడు బూరెలు. యింకా బోణీ కాలేనంట! యిదా వ్యాపారం? అవ్వా! ఈ అవ్వకిందులో ఏం మిగుల్తుంది? పెట్టుబడెంత? లాభం ఎంత? ఏం తింటుంది రోజూ?...."అబ్బ ఎందుకలా కుమ్మేసుకుంటారు" ఒకసారి కసిరాడు. దీన్ని ఎవ్వరూ లక్ష్యపెట్టక పోవటం వేరే విషయం.


"పిచ్చరేం బాగోలేదంట." ఎవరెచ్చెప్పారంట? "మాణింగ్ సో చూసినోళ్ళు." "మరెందుకొచ్చావ్?" "ఎందుకు బాగోలేదో సూద్దామని?" "హోర్ని! బాగా ఎడ్వాన్స్ అయిపోయారన్నమాట తెలుగు సినిమా ప్రేక్షకులు. అందుకే ఎలాంటి చెత్త బొమ్మయినా కనీసం వందరోజులు ఆడేస్తుంది. తనూ, తన పెళ్ళాం హీరో, హీరోయిన్లుగా ఓ సినిమా తీసేసినా కనీసం యాభై ఆడేస్తది! ఈ రోజుల్లో అన్నీ విచిత్రాలే!!"

ఒకటిన్నరయింది. తనొచ్చినప్పుడు తనే ఆఖర్న వున్నాడు. ఇప్పుడు తనెనకాల రెండు ఫర్లాంగుల క్యూ వుంది. టికెట్ తనదాకా వస్తాదో లేదో. అన్నీ సస్పెన్సే! వెధవ బ్రతుకు "గురూగారూ! ఆ పెన్నింటికి!" అంత పెద్ద బోర్డు రాసి వుంటే నన్నే అడగాలేంటి వీడు! అయినా అదేం పిలుపు? తనెక్కడ ఎలా. ఎప్పుడు గురుపు వీడికి? వెధవ చనువు ఒళ్ళు మండుతోంది. యిలాంటి వేషాలంటే తనకి గిట్టవు "ఒళ్ళు మంటయితే ఏం చేశావ్? ఏమన్నావ్ అతన్ని?" "ఏమీ అనలేదు." "ఏం ఎందుకని?" "సభ్యత కాదని." "అలా ఏమీ చేయలేనప్పుడు ఉడుకుంటా వుంటే సరి, అలా గింజకు పోవటమెందుకు చేతకానప్పుడు!"

బుకింగ్ ఆఫీస్ గేట్ కి, తనకి మధ్యన లేదంటే యాభైమంది వున్నారు. ఒకవేళ తనకి టికెట్ దొరక్కపోతే? ఈ శ్రమంతా వేస్టేనా? అనుమానమెందుకూ? ఖచ్చితంగా వేస్! అసలు మానవ జన్మే వేస్ట్. అదిగో. అవకాశం యిస్తే చాలు వెధవ మెట్ట వేదాంతం తల దూర్చేస్తోంది. కాస్త చికాకులో వున్నప్పుడు వుప్పు అందితే చాలు వాయువేగాలతోవచ్చి మీద వాలిపోతుంది.







క్రిందకి లాగేస్తుంది వంటికి నీరసాన్ని వట్టించేస్తుంది ఫుల్‌గా- మహా డేంజర్!

"మీ రెక్కల కష్టమే మా జీవనాధారం బాబూ" తన చిన్నప్పటినుంచీ కుష్టువాళ్ళ యిదే స్లోగన్. అప్పుడర్థం అయ్యేదికాదు దానం అడగటంలో అందంగా, వేడుకుంబూ యాచించట మన్నమాట అయినా యింకా ఏం సాధిద్దామని వీళ్ళు బ్రతకటం? అన్నీ బాగావున్నవాళ్ళే ఎందుకు బ్రతకాలో తెలియక తికమకపడి ఛస్తున్నారు. వీళ్ళ కెందుకింత మోజు బ్రతకాలని? ఎవరికోసం? ఎవరికి సుఖం? "ఖర్మ అనుభవించాలి కాబట్టి!" ఒకాయన ఎప్పుడో చెప్పినట్టు గుర్తు. ఖర్మ సిద్ధాంతాన్ని బాగా మరగకాచి వడగట్టి, తాగేసిన వాడట ఆ చెప్పినాయన. అందుకని ఆయన మాటలన్నీ నమ్మేయాలనుందా?

అమెరికాలో "మెర్సీ కిల్లింగ్" అని ఓ చట్టం వుందంట. భరించలేని రోగాలతో బాధపడేవారిని మందిచ్చి చంపేయొచ్చునట దాని ప్రకారం. యిది మృత్యుముఖానున్న రోగికి వుపకారమే మరి. త్వరగా బాధలు తప్పుతాయిగా వాళ్ళకి. యిక్కడలాంటి కూతలు కూస్తే నరికి పోగులెడతారు! యిదంతా తను ఆ మధ్య ఏదో పుస్తకంలో చదివాడు. చదివితే? మర్చిపోవాలి. అంతేగాని గుర్తుందికదా, మంచిదికదా అని పైకి వాగితే ఛంపేస్తారు!!

"అరరె! యింక పదివుంది తర్వాత తనే. బుకింగ్ ఆఫీస్ మూసేయకుండా వుంటే బాగుంటుంది. క్యూలో ఆఖర్న. తన వెనకాల రెండు ఫర్లాంగులవతలవున్న వాడి బుర్రలోనూ బహుశా ఆదే ఆలోచన వండర్‌ఫుల్! వండర్‌ఫుల్లే మరి! అనుమానవ జన్మే వండర్‌ఫుల్."

"బాబూ! నాయనా!!" యిదెవరు? పిచ్చిదానిలా వుంది వాలకం చూస్తుంటే. కాదు మంచిదే. బుద్ధిగానే అడుక్కుంటోంది గుడ్డలిప్పెయ్యలేదు. రాళ్ళు విసరటం లేదు అందరిమీద కాబట్టి మంచిదే. బాగా చిక్కిపోయి, కళ్ళు పీక్కుపోయి, చింకిరి జుట్టుతో, చినిగిపోయిన బట్టలతో నిలబడితే ఎవరయినా పిచ్చోళ్ళలాగే కనిపిస్తారు! మరి డాక్టర్లేం చెబుతారో పిచ్చి గురించి: అయినా తన పిచ్చిగాని. పిచ్చి గురించి ఒకళ్ళు చెప్పాలేంటి? పైకి కొట్టొచ్చినట్టు క్లియర్‌గా కనబడి పోద్ది కదా!

గిడోర్
మరియు
టపారియా
హేండ్ టూల్స్
స్టాకిస్టు:
టూల్స్ & టూల్స్
కాన్వెంట్ వీధి, విజయవాడ-1
Savita

పిచ్చిదాన్ని (!) రెండోసారి చూసినప్పుడు "అరె" అనుకున్నాడు తను. తన మనసు వెనక్కి పరుగెత్తింది. మూడేళ్ళ వెనక్కి. ఊహూఁ. పోనీ నాలుగేళ్ళు? ఓ. కె. అక్కడాపితేసరి.

తన కెన్నేళ్ళప్పుడు? ఏభైలో నాలుగు తీసేస్తే నలభై ఆరు. ఏమంత పెద్దవయసు? కాని యింటిది దొక్కుయి పోయింది. మునలేషాలు పెంచేసింది. పిల్లల్నిడి చిరాదు. తన పక్కవైపే రావటం మానేసింది రాత్రుళ్ళు. మగోడికి చచ్చేదాకా వుంటాయంట కోరికలు. మరి తనకి నలభై ఆరేగా యింకా అప్పటికి! తన కుండవేంటి? విసుగెత్తి పోయాడు.

చాలాఏళ్ళయింది అలా బయల్దేరి. కుర్రతనం, పెళ్ళికాని రోజులు గుర్తుకొచ్చాయి రిక్షా ఆగింది. "బాబుగారు మాంచి రసికులు" రిక్షావాడి బిరుదు గిలిగింతలు పెట్టింది. "నువ్వీ జంక్షన్‌లోనే వుండరా" తిరిగి వాడే వెనక్కి తీసుకువెళ్ళేలా బేరం

అన్నీ అద్దాలే! ఎంతయిందో గదినింత షోకు చెయటానికి? ఎన్ని కాపురాలు కొల్లలుగా కూలిపోతే యిన్ని సామాన్లు పోగయ్యాయో! యిలాంటిచోట మాంచి పిల్ల-తన వాలకం చూసి వొప్పుకుంటాదో లేదో! అయినా తన పిచ్చిగాని వాటం. వాలకం చూసి చేస్తారేటి వ్యాపారం ఎలాగూ రాములు షాప్‌లో వచ్చేముందు గెడ్డం గీయించి ముఖానికి కోటింగ్ వేయించాడు కాబట్టి కొంతవరకు ఫరవాలేదు "రాత్రిపూట గీయిత్తన్నారేటి బాబూ" వెధవ నవ్వొకటి నవ్వాడు. వాడు అనుమానించే వుంటాడు. అయినా సాని కొంపలమ్మటా తిరిగే వాళ్ళుకాక రాత్రిపూట షేవింగ్ ఎవడు చేయిస్తాడు అర్జంటుగా?! వాడనుమానిస్తే ఎవడికి లెఖ్ఖ! బోడి!!

వచ్చి ఎదురుగా బొమ్మలల్లే నిలబడిన నలుగుర్లో బాగా మెర్సిపోతోం దొకపిల్ల. తనకిష్టమైన ఉపమానం దబ్బపండు. అందుకు అలాగే పిలిచాడు. "నాపేరు లక్ష్మి" గొంతుక కూడా ఫరవాలేదు. శ్రావ్యంగా వుంది సంగీతం కూడా వొచ్చునేమో! అయినా పిచ్చిగాని గంటసేపు భాగోతానికి వూరికే "భర్తలా" ఫీల్ అయిపోవట మేమిటి ??

"ఎంతేంటి గంటకి ?"

చెప్పింది.

బేరమాడాలనిపించలేదు తనకి. నోట్లు లెక్కపెట్టి యిచ్చేశాడు.

"రా మరి" పెళ్ళయిన క్రొత్తలో పెళ్ళాన్ని కింగారుపెట్టిన రోజులు గుర్తొచ్చాయి. ఛఛ! యిప్పుడుకూడా దాని న్యూసెన్సేనా! దానికి జ్ఞానం వుంటే తనకీ తిప్పలెందుకు ? ఏమో! ఒకవేళ తన నుదుట ఈ దబ్బపండు వ్రాసి వుండబట్టే తన భార్యామణి సహకార నిరాకరణోద్యమాన్ని సాగిస్తున్నదేమో?

"ఉండండి! కంగారేటి? డబ్బులట్టుకెళ్ళి మా నాయకురాలికిచ్చి రావాల."

ఆ తర్వాత రెండు మూడు సార్లు ప్రయత్నించాడు దబ్బపండు కోసం. కంపెనీ మారిందని వొకసారి, యింకో వూరెళ్ళిపోయిందని మరోసారి చెప్పారు. ఆ తర్వాత....

యిదే కనపడటం. తన దబ్బపండు యిలా అయిపోయిందేవిటి?

"నీ పేరేంటి?" తటపటాయించి ఆఖరికి అడిగేశాడు. మతిష్టిదానితో మాట్లాడితే ఎవరనుమానిస్తారు? కరెక్టే ఆలోచన! బుర్ర బాగానే పనిచేస్తోంది.

"నా పేరెందుకు బాబూ?" దాని కాశ్చర్యం

యింకో యిద్దరి తర్వాత వరసలో తనే వున్నాడు జనం గెంటుకుంటున్నారు ఆతృతతో.

"నీ పేరు లక్ష్మికదూ? నాల్గు సంవత్సరాల క్రితం రంగమ్మ కంపెనీలో వుండే దానివి కదూ?" అడిగేశాడు.

"అవును బాబూ! యింతకీ...." జరగండి! జరగండి? మళ్ళీ గెంటుకుంటున్నారు జనం.

"నిన్నిలా చేసిన పాపాత్ముల్లో........" యింకా ఏదేదో గొణిగాడు. దానికేమీ వినిపించలేదు. దాని చేతిలో పది రూపాయల నోటు పెట్టాడు. తను ప్రవేశించగానే తలుపులు మూసేశారు. తన వెనకాల వున్న వాళ్ళంతా తన గురించి ఏమనుకున్నారో తనకి వినిపించలేదు. తన కళ్ళల్లో నిండిన కన్నీళ్ళు వాళ్ళకి కనిపించలేదు.

క్రుళ్ళిపోయిన యింత పెద్ద ప్రపంచంలో ఒకడు పశ్చాత్తాప పడినంత మాత్రాన ఏపాటి వుపకారం?